





# విభారె తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 23-01-2024 సంపుటి : 06 సంచిక : 134 పేజీలు : 8 వెల : రూ


**అయోధ్యకు చేరిన సీతమ్మ వారి పుట్టింటి సారె....**
**భక్తి శ్రద్ధలతో ముగిసిన శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట.**

# జన జాగరణతో పులకించిన అయోధ్యా నగరం...



అయోధ్య :అయోధ్యా నగరం సోమవారం పులకించి పోయింది. ప్రపంచం లోని హిందువులంతా 500 సంవత్సరాల కాలం నుంచి ఎదురు చూస్తూ ఉన్న ఆ బృహత్తర కార్యక్రమం అయోధ్యాపురి లో అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య బాల శ్రీరాముని విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు చేసి, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాధ్, ఆర్.ఎస్.ఎస్. చీఫ్ ప్రవీణ్ తొగాడియా లతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి మాజీ కేంద్ర మంత్రి కొణిదెల. వర ప్రసాద్ (చిరంజీవి), మాజీ కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర చీఫ్ దగ్గుబాటి.



పురందేశ్వరి, మాజీ ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు, జనసేన చీఫ్ కొణిదెల. పవన్ కళ్యాణ్ (కళ్యాణ్ బాబు) తదితరులు హాజరయ్యారు. పరమ పావని, జగజ్జనని, ఆ సీతమ్మ తల్లి జన్మ స్థలమైన నేపాల్ దేశంలోని జనకపురి నుంచి పుట్టింటి వారి తరుపున ఆ ప్రాంత ప్రజలు వందలకు, వేలు తోడై చివరికి లక్షలాది మంది తమ ఆడ పడుచు కోసం చీరలు, సారెలు, పసుపు కుంకుమలు, ఇంకా ఇతర వస్తువులను చేతబూని ఆమె మెట్టినిల్లు అయోధ్యా నగరానికి ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఈ నెల 16వ తేదీ మొదలైన రామాలయ ప్రారంభోత్సవ వేడుకలు 22వ తేదీ తో ముగిశాయి. న అయోధ్యలో సీతారాములతో బాటు హనుమంతుని విగ్రహానికి భక్తితో ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హాజరు కావాల్సిందిగా భారత ప్రభుత్వం ఇతర దేశాలలో ఉన్న భారతీయులకు ఆహ్వానాలు కూడా పంపింది. అదే సమయంలో మహాసాధ్వి, పరమ పావని, జగజ్జనని అయిన సీతమ్మ వారి జన్మస్థలం జనక పురి ప్రాంత ప్రజలకు భారత ప్రభుత్వం, అయోధ్య రామాలయ తీర్థ ట్రస్టు నిర్వాహకులు సమాచారం అందించడంతో జానకీ దేవి జన్మ స్థలమైన జనక పురి ప్రాంత ప్రజలు వందలకు, వేలు మంది తోడై చివరికి లక్షలాది మంది తమ ఆడ పడుచుకు చీరలు, సారెలను ఘనంగా సమర్పించు కున్నారు. సుమారు 460 కిలో మీటర్ల దూరం పాదయాత్ర చేపట్టిన జనక పురి వాసులు వాయు వేగం, మనో వేగంతో సుమారు 95 గంటల పాటుగా నడిచి అయోధ్యా నగరానికి చేరుకోవడం జరిగింది. దారి పొడవునా జనకపురి ప్రాంత ప్రజలకు భారత ప్రజలు ప్రత్యేక హారతులు పట్టి అయోధ్యా నగరానికి సాగనంపారు. మొత్తం మీద సీతమ్మ వారి పుట్టింటి వారి చీర, సారెలు ఈ నెల 21 వ తేదీ రాత్రికి చేరింది. జనక పురి నుంచి అయోధ్యా నగరానికి బయలు దేరిన సీతమ్మ వారి పుట్టింటి ప్రజలకు, సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీ కోదండ రామస్వామి వారి భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు అటువైపు నేపాలీ ప్రభుత్వం, ఇటువైపు భారత ప్రభుత్వం అన్ని విధాలా కట్టుదిట్ట మైన ఏర్పాట్లను పూర్తి చేసింది. అయోధ్య రామాలయ తీర్థ ట్రస్టు సభ్యులు ఎప్పటి కప్పుడు వీరి గురించి సమాచారం తెలుసుకుంటూ బలమైన సంఘీభావాన్ని తెలియ జేశారు. భారత ప్రజలే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది సీతారాముని భక్తజనం వేయి కళ్ళతో ఎదురు చూస్తూ ఉన్న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం 22వ తేదీన అయోధ్యా నగరంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా కన్నుల పండుగగా జరడంతో కోట్లాది మంది ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# నేడు ఉరవకొండలో సిఎం జగన్ పర్యటన

**డ్వాక్రా మహిళల ఖాతాల్లో నగదు జమ**
**సిఎం రాక సందర్భంగా భారీగా బందోబస్తు**



అనంతపురం,జనవరి22 : ఏపీలో డ్వాక్రా మహిళలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి శుభవార్త అందించారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొని డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు. సీఎం వైఎస్ జగన్ మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో పర్యటించనున్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించి.. కంప్యూటర్ బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల నగదు జమ చేయనున్నారు. ప్రభుత్వం ఇదివరకే వైఎస్సార్ ఆసరా కింద మూడు విడతల్లో రూ.19,175.97 కోట్లు డ్వాక్రా మహిళలకు అందించింది. నాలుగో విడత కిందట రూ.6,394.83 కోట్ల మొత్తాన్ని 78 లక్షల మంది ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లబ్ధిదారుల జాబితాపై ఏమైనా సందేహాలు ఉన్నవారు హెల్ప్‌లైన్ నంబర్ 0863-2347302 కు కాల్ చేయవచ్చు. సీఎం వైఎస్ జగన్ జనవరి 23వ తేదీన ఉదయం 9 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి 9.45 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు పుట్టపర్తి ఎయిర్ పోర్టు నుంచి జగన్ హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం 10.30 నుంచి 10.40 గంటల వరకు ప్రజాప్రతిధుల తో సీఎం జగన్ మాట్లాడతారు. అక్కడి నుంచి బహిరంగ సభావేదిక వద్దకు వెళ్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలవమాల వేసి నివాళు లర్పించనున్నారు. స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా సంఘాల) మహిళలతో సీఎం జగన్ మాట్లాడి వారి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం కార్యక్రమంలో సీఎం జగన్ ప్రసంగిస్తారు. తరువాత వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద డ్వాక్రా సంఘాల ఖాతాల్లో ఆయన నగదు జమ చేస్తారు. కార్యక్రమం పూర్తయ్యాక జగన్ స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలతో చర్చిస్తారుమధ్యాహ్నం దాదాపు 2 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.30కు పుట్టపర్తి ఎయిర్ పోర్ట్‌కు చేరుకుని.. అక్కడి నుంచి విమానంలో గన్నవరం బయలుదేరతారు. అటు నుంచి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారని అధికారులు తెలిపారు. వైఎస్ జగన్ ఉరవకొండ పర్యటనకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మాధవ రెడ్డి తెలిపారు. ఇదివరకే సత్యసాయి ఎయిర్ పోర్ట్ పరిసరాలను ఆయన పరిశీలించారు.

# మన రాముడు వచ్చేశాడు..

**ఇక టెంట్లో ఉండాల్సిన పనిలేదు**
**శతాబ్దాల నిరీక్షణకు తెర**
**సహనం, కృషి, త్యాగాల ఫలితమే ఈ ఉజ్వల ఘట్టం**
**ఎక్కడో లోపం వల్లే ఇన్నాళ నిరీక్షణ**
**అందుకు రాముడిని క్షమాపణలు కోరుకుంటున్నా**
**మన ఆస్తి..అస్తిత్వం..సత్యం అంతా రాముడే**
**కొత్త కాలచక్రం మొదలయ్యింది**
**ఉద్వేగపూరతి ప్రసంగంలో ప్రధాని మోడీ**




అయోధ్య,జనవరి22( : రాముడు వచ్చేశాడు..మన రాముడు వచ్చేశాడు..ఇక టెంటులో ఉండా÷-లసిన ఖర్మ రాముడికి లేదు... నభూతో నభవిష్యతి అనే రీతిలో అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ట అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. 'సియావర్ రామ్ చంద్ర కీ జై, హమారే రామ్ ఆ గయా హై' అంటూ అతిథులు, రామభక్తుల హర్షాతిరాకాలు మధ్య తన ప్రసంగాన్ని ప్రారంభించారు. వేలాది సంవత్సరాల తర్వాత కూడా రామప్రతిష్ఠ జరిగిన ఈరోజును ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. రాముని దివ్యాశీస్సులు ఈరోజు మనం అంతా చవిచూస్తున్నామని అన్నారు. శతాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ శ్రీరాముడు ఎట్టకేలకు మనముందుకు వచ్చారని అన్నారు. శతాబ్దాల సహనం, కృషి, త్యాగాల ఫలితమే ఈరోజు రాముడు తిరిగి వచ్చారని అన్నారు. దశాబ్దాల పాటు న్యాయపోరాటం జరిగిందని, న్యాయాన్ని గెలిపించిన భారతదేశ న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. ఈరోజు రాముడికి క్షమాపణ చెప్పుకుంటున్నానని, మన ప్రయత్నాల్లో, త్యాగాల్లో ఎక్కడో లోపం జరిగి శతాబ్దాలుగా ఈరోజు కోసం నిరీక్షించాల్సి వచ్చిందని మోదీ అన్నారు. ఈరోజు అందరి కల సంపూర్ణమైందని, శ్రీరామచంద్రుడు అందర్నీ తప్పనిసరిగా క్షమిస్తారని తాను నమ్ముతున్నానని చెప్పారు. జనవరి 22వ తేదీన సూర్యుడు అత్యద్భుతమైన మెరుపులతో కాంతులు వెదజల్లారని, 2024 జనవరి 22వ తేదీ కేవలం క్యాలెండర్ మీద రాసిన రాత కాదని, సరికొత్త కాలచక్రానికి కేంద్రస్థానమని అన్నారు. రామ్‌లల్లా ఇంకెంతమాత్రం టెంట్‌లో కాలం గడపాల్సిన అవసరం లేదని, ఆయన భవ్యమైన రామాలయంలోనే కొలువుతీరుతారని చెప్పారు.

# కోడికత్తి కేసుపై నేడు విచారణ

**బెయిల్ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు**

అమరావతి,జనవరి22 : కోడి కత్తితో సీఎం జగన్ పై దాడి చేసిన కేసులో నిందితుడు అయిన జనపల్లి శ్రీనివాసరావు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో మంగళవారం విచారణ జరగనుంది. శ్రీనివాసరావు బెయిల్ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని సమతా సైనిక దళ్ పిటిషన్ వేసింది. సీఎం జగన్ మోహన్ రెడ్డి కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోడి కత్తి శ్రీను పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పాలేటి మహేశ్ సోమవారం ఉదయం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోడి కత్తి దాడి కేసులో ఐదేళ్లుగా శ్రీనుకు బెయిల్ రావడంలేదని.. ఆయన జైల్లోనే మగ్గిపోతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో సీఎం జగన్ కోర్టుకు వచ్చి చెప్పేలా ఆదేశాలివ్వాలని కోరారు. అంతేకాదు శ్రీను కుటుంబ సభ్యుల దీక్ష సందర్భంగా జరిగిన పరిణామాలను కోర్టుకు వివరించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణకు హైకోర్టు అనుమతించింది. పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారించనుంది. జస్టిస్ దుర్గాప్రసాద్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. 2019 ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో కోడి కత్తితో శ్రీను దాడి చేశారు. ఈ దాడిలో జగన్ భుజంపై గాయమైంది. చికిత్స పొందడంతో ఆయనకు అయిన గాయం మానిపోయింది. అయితే ఈ కేసులో శ్రీనును పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయనకు బెయిల్ రావడంలేదు. ఇటీవల ఈ కేసులో సీఎం జగన్ సాక్ష్యం చెప్పాలని కోర్టు ఆదేశించింది. అయితే ఏదో ఒక కారణంతో సీఎం జగన్ కోర్టుకు వెళ్లడంలేదు. దీంతో శ్రీను కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరికి మద్దతు పెరుగుతోంది. శ్రీను తల్లి, సోదరుడిని కలిసిన సైనిక్ దళ్ అధ్యక్షుడు , ప్రముఖ న్యాయవాది పాలేటి మహేశ్ సంఘీభావం ప్రకటించారు. విశాఖ సెంట్రల్ జైలులో కోడికత్తి శ్రీను నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయనతో లీగల్ ఇంటర్వ్యూకు కోర్టు అనుమతి ఇచ్చింది. లీగల్ ఇంటర్వ్యూకి శీను చేతుల మీద మోసుకొచ్చారు. ఆయన నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. ఆరోగ్యం క్షీణించినా దీక్ష కొనసాగిస్తానని శ్రీను లాయర్లకు చెప్పారు. ఐదేళ్లు దాటినా ఇంకా జైల్లో ఉండటం .. కింది కోర్టులో ట్రయల్ కూడా నిలిపివేయడంతో హత్యలు చేసిన వాళ్లు కూడా బెయిల్ మీద ఉన్నారని కానీ చిన్న నేరానికి శీను జైల్లో మగ్గిపోతున్నారన్న అభిప్రాయం అంతటా వ్యక్తమవుతోంది.



# 500 ఏళ్ల కల నెరవేరింది: యోగి ఆదిత్యనాథ్

అయోధ్య: 500 ఏళ్ల కల నెరవేరిందన్నారు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఈ క్షణం కోసం 500 ఏళ్లుగా భారతీయులు ఎదురు చూశారన్నారు. దేశమంతా రామ నామమే మార్మోగుతోందని..రాంనగరికి వచ్చిన వారందరికీ స్వాగతం చెప్పారు. అన్ని దారులూ రామ మందిరానికే దారి తీస్తున్నాయన్నారు. ప్రాణ ప్రతిష్టకు హాజరైన వారి జీవితం ధన్యమైందన్న యోగి.. మనమంతా త్రేతా యుగంలోకి వచ్చినట్లుందని తెలిపారు. బాలరాముడి రూపాన్ని చెక్కిన శిల్పి జీవితం ధన్యమైందని అన్నారు..ఈ రోజు ప్రతి రామ భక్తుడు సంతోషం, గర్వం, సంతృప్తితో ఉన్నాడని అన్నారు యోగి ఆదిత్యనాథ్. తన ఆలయం కోసం సాక్ష్యాత్తూ శ్రీరాముడే పోరాడాల్సి వచ్చిందన్నారు. అనుకున్న చోటే రామాలయం నిర్మించామని తెలిపారు. కాగా అయోధ్య? భవ్య మందిరంలో దివ్య రామయ్య విగ్రహం ఆవిష్కృతం. వైభవంగా బాలరాముడి ప్రాణ ప్రతిష్ట జరిగింది. అభిజిత్ ముహూర్తంలో రాముడు తొలి దర్శనం ఇచ్చారు. పసిడి కిరీటం, పట్టువస్త్రం, ముత్యాల కంఠాభరణంతో రాముడిని సుందరంగా అలంకరించారు. రమణీయంగా రామయ్య ప్రాణ ప్రతిష్ట మహోజ్వల ఘట్టం జరిగింది.రామ్‌లల్లాలకు ప్రధాని మోదీ తొలి హారతి ఇచ్చారు. అయోధ్య రామాలయంపై హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించారు.

# సంపాదకీయం

మంగళవారం 23-01-2024

## అయోధ్య చరిత్ర ... ఓ సువర్ణాధ్యాయం !

రామనామంతో అయోధ్య మార్మోగింది. ప్రపంచమంతా పులకించింది. రామ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగవైభవంగా సాగింది. నభూతో..నభవిష్యత్ అన్నట్లుగా రామరాజ్యానికి అంకురార్పణ జరిగింది. దేశమంతా రామనామజపం చేస్తునన పుణ్యకాలంలో.. అయోధ్యలో అపూర్వ ఘట్టం అవిష్కృతం అయ్యింది. వేదోక్తంగా అయోధ్య రాముడికి ప్రధాని మోడీ చేతులమీదుగా ప్రాణప్రతిష్టాపన జరిగింది. వందల ఏళ్ల కలను సాకారం చేయగా..ఈ తరం అద్భుత అవకాశాన్ని వీక్షించారు. 2025 జనవరి 22 చరిత్రలో సువర్ణాధ్యాయంతో మిగిలిపోనుంది. దేశ చరిత్రలో అయోధ్య..అంటే జనవరి ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది. ఆగస్ట్ 15ను మించి చిత్రలో లిఖితం కానుంది. భవ్య,దివ్య రామమందిర నిర్మాణంతో పాటు..ప్రాణప్రతిష్ఠతో వందల ఏళ్ల దుర్మార్గానికి చరమగీతం పాడినట్లు అయ్యింది. ప్రాణప్రతిష్ట విజయవంతం కానుండడంతో ఇక ప్రజలంతా అయోధ్య రాముడి దర్శనం చేసుకునే వీలు కలిగింది. ఈ క్రమంలో అయోధ్య కోసం అమరులైన ఎందరో సాధువులు, సంతుల, కరసేవకులు వారి జీవితాలు ధన్యం అయ్యాని భావించాలి. వారిని మనమంతా నిరంతరం స్మరించుకోవాలి. మొత్తంగా ఇప్పుడు వందల ఏళ్ల కల సాకారమయ్యింది. అయోధ్యలో రామయ్యకు దివ్యమైన భవ్యమైన మందిరం కట్టడం ద్వారా ముష్కర దాడులకు సమాధానం చెప్పగలిగాం. 500 ఏళ్ల పోరాటంలో అయోధ్య ఒక విజయ చిహ్నంగా నిలిచిపోగలదు. అయోధ్య ప్రాణప్రతిష్ఠ దివ్య ముహూర్తం 84 సెకండ్లపాటు కొనసాగింది. మధ్యాహ్నం 12:29:03 గంటల నుంచి 12:30:35 వరకు కొనసాగింది. ఈ సమయంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఎన్నాళ్లో వేచిన జనహృదయం ఉప్పొంగేలా ..రామభక్తులంతా ఆ బాలరాముని దర్శనం కోసం తపిస్తున్న కల సాకార మయ్యింది. అల సాకేతపురిలో జన్మించి.. సరయూ నది ఒడ్డున ఆటలాడి.. తండ్రిమాట జవదాటని పితృవాక్య పరిపాలకుడిగా ఎదిగి.. ప్రజా హృదయ సామ్రాట్టుగా విరాజిల్లుతున్న ఆదర్శ పురుషుడు, అవతారమూర్తి ప్రాణప్రతిష్ఠ సుముహూర్తం అంతా అనుకున్నట్లుగా పూర్తి కావడం భారీతీయులకు గర్వకారణం. బాలరాముడి నేత్రోన్మీలనాన్ని తిలకించిన జనం పులకరించారు. మరపురాని ఈ వేడుకలను కనులారా వీక్షించేందుకు.. సంబరాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకుని ఆ జ్ఞాపకాలను మనసు పొరల్లో దాచుకునేందుకు.. దేశం నలుమూలల నుంచి తరలి వచ్చి భక్తులతో అయోధ్యాపుర వీధులన్నీ నిండి పోయాయి. లౌడ్ స్పీకర్లలో వినిపించే రాముడి పాటలతో.. రామయ్య భజనలతో మారుమోగాయి!! రెపరెపలాడుతూ ఎగిరే రామ ధ్వజాలతో.. రామనామ సంకీర్తన చేసే సాధుసంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందడి నడుమ.. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అభిజిత్ లగ్నంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం మొదలు అయ్యింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమంలో పాల్గొని రాముడి విగ్రహం కళ్లకు కట్టిన పుసుపు వస్త్రాన్ని తొలగించి తొలి దర్శనం అందుకున్నారు. మొత్తంగా అయోధ్య ఘట్టం భారతీయ సంస్కృతీ సంప్రదయా లకు చిరునామాగా నిలవనుంది. వేలాది మంది బలిదానాలకు సమాధానం దక్కింది. దాదాపు 500 ఏళ్ల కల సాకారం అయ్యింది. ఈ ఉద్విగ్న ఘట్టంలో ప్రజలంతా మమేకం కావడం..ప్రపంచ వ్యాప్తంగా రామనినాదం మార్మోగం మరువలేని అనుభూతి కానుంది. అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా సాగింది. ఈ అద్భుతమైన, అరుదైన ఘట్టాన్ని చూసేందుకు, శ్రీరాముడి ఆశీస్సులు పొందేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు సహా రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులతో పాటు దేశ నలుమూలల నుంచి భక్త జనులు అయోధ్యకు తరలి వచ్చారు. గత పది రోజులుగా అయోధ్యలో ప్రాణప్రతిష్ఠాపన క్రతువులను వేదోక్తంగా నిర్వహించారు. అయోధ్యకు వెళ్లలేక, ఈ అద్భుత క్షణాలను నేరుగా ఆస్వాదించలేకపోతున్నామని భావించిన కోట్లాది రామ భక్తులు టీవీల ముందు అఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించారు. ఈ మొత్తం వ్యవహారంలో అంలే గత దశాబ్ద కాలంలో ప్రధాని మోడీ తీసుకున్న చొరవ, సుప్రీం తీర్పు, దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు కారణంగా అయోధ్య వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఇందులో రాజకీయం లేదు. రాజకీయ జోక్యం లేకుంటే అయోధ్య పరిష్కారం అయ్యేది కాదు. ఈ మాత్రం జ్ఞానం లేని కాంగ్రెస్‌తో పాటు, విపక్ష నేతలు దీనిని రాజకీయం చేసి అభాసు పాలయ్యారు. ప్రజలతో కలసి నడవాలన్న జ్ఞానాన్ని పొందలేదు. రామమందిరం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో దాదాపు 2 గంటల పాటు మంగళ ధ్వనులు ప్రతిధ్వనించాయి. దీనికోసం భారతీయ సంప్రదాయానికి చెందిన ఘటం (ఏపీ), మృదంగం, నాదస్వరం (తమిళనాడు), వీణ (కర్ణాటక) తదితర 50 రకాల సంప్రదాయ సంగీత వాయిద్యాలను సిద్ధం చేశారు. 22న ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. దాదాపు 70 సంవత్సరాల పాటు ఒక గుడారానికి పరిమితమై అక్కడే పూజలందు కుంటున్న పాత రామ్ లల్లా... 21న రాత్రి శయన హారతి అనంతరం 22న సోమవారం కొత్త ఆలయంలో మేల్కొన్నారు. ఆదివారం రాత్రి హారతి తర్వాత పాత విగ్రహాన్ని నూతనంగా నిర్మించిన రామమందిరంలోకి తరలించారు. అలాగే లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, స్వామి హనుమ విగ్రహాలను కొత్త ఆలయంలోకి తీసుకెళ్లారు. దశాబ్దాల అనంతరం ఈ నెల 20, 21వ తేదీల్లో పాత ఆలయం మూసి ఉండటంతో భక్తులకు వరుసగా రెండు రోజుల పాటు రామ్ లల్లా దర్శనం లభించలేదు. ఇప్పుడు వారందరికీ ఆయన కొత్త మందిరంలో దర్శన భాగ్యం కలిగించనున్నారు. కొత్తగా ప్రతిష్ఠించే బాల రాముడి విగ్రహం ముందు భాగంలోనే.. ఈ విగ్రహాలను కూడా ఉంచుతారు. ఆరు అంగుళాలు మాత్రమే కాగా, మిగిలిన విగ్రహాలు అంతకంటే చిన్నవి. ఈ నేపథ్యంలోనే.. పెద్ద విగ్రహాన్ని తయారు చేయించాలని ట్రస్టు నిర్ణయించింది.

## అంగన్వాడీ ల అరెస్టులను ఖండించిన సిపిఎం సీఐటీయూ నాయకులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22–..జిల్లాలో రోజురోజుకు అంగన్వాడీలపైన నిర్బంధం పెరిగిపోతుంది.అంగన్వాడీ ల సమ్మెను ఎలాగైనా విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుంది.. విధుల్లో చేరకపోతే ఉద్యోగాలనుండి తొలగిస్తామని ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా హెచ్చరిస్తున్న అంగన్వాడీ లు మొక్కవోని దీక్షతో తమ హక్కుల సాధనకు ఆందోళన చేస్తున్నారు. ఉద్యోగాల నుండి తమను తొలగిస్తే ప్రభుత్వం కొరివితో తల గీక్కున్నట్లేనని అంగన్వాడీ లు హెచ్చరిస్తున్నారు. సోమవారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం కు అంగన్వాడీ లను వెళ్ళనివ్వకుండా పోలీసులను ఉపయోగించి ఎక్కడికక్కడ అంగన్వాడీ లను అరెస్టు చేయించి రాత్రంతా పోలీస్ స్టేషన్ లలోను,ఫంక్షన్ హాల్ లో ఉంచారు. ప్రభుత్వ, పోలీసుల దమన కాండను నిరసిస్తూ నంద్యాల లోని మున్సిపల్ కార్యాలయం నుండి రాజారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సిపిఎం సీఐటీయూ నాయకులు,అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున రోడ్డుపై బైటయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. సీఎం డౌన్ డౌన్, అంగన్వాడీ ల సమస్యలు పరిష్కరించాలి,26 వేల రూపాయలు వేతనం పెంచాలి.. ఆదివారం రాత్రి అరెస్టు చేసిన అంగన్వాడీ లను విడుదల చేయాలని నినధించారు. దీంతో నంద్యాల నుండి కర్నూలు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల వెళ్లే రహదారి వెంట బస్సులు వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ట్రాఫిక్ స్థంభించి పోయింది.దీంతో చేసేదేమి లేక పోలీసులు అంగన్వాడీ లను వదిలిపెట్టారు.అంతకు ముందు జరిగిన ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరిన అంగన్వాడీ లను అక్రమంగా అరెస్టులు చేసి ఫంక్షన్ హాళ్లలోనూ, రైల్వే స్టేషన్ లలో పోలీసులు నిర్బందించడాన్ని తీవ్రంగా పరిగణించారు.ప్రభుత్వం,పోలీసుల చర్యలను ఆయన ఖండించారు. అంగన్వాడీ ల పట్ల ప్రభుత్వం తీరు మారక పోతే మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా గత 43 రోజులుగా అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని నిరవధిక సమ్మె చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసి న ప్రభుత్వం వారిని బెదిరింపులకు దిగడం దారుణమన్నారు.43 రోజులుగా మహిళలు రోడ్లు ఎక్కిన దుస్థితి తీసుకురావడం దుర్మార్గమన్నారు. జగన్ కు అధికారం ఉందని సమస్యలను పరిష్కారం చేయకుండా విజయవాడకు వెళ్లకుండా ఎక్కడికెక్కడ మహిళలను అర్ధరాత్రిలు స్టేషన్లో ఉంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియకుండా భయభ్రాంతులకు గురి చేయడం పద్ధతి కాదని టి. రమేష్ కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్ , కోశాధికారి పి వెంకట లింగం,ఏపీ అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు నాగరాణి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేసేంతవరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రాబోయే కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి వైసిపి పార్టీకి పుట్టగతులు లేకుండా చేస్తామని జగన్ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలని జోస్యం చెప్పారు.పోలీసుల అక్రమ అరెస్ఠులను ఖండించారు.ఆందోళనలో లతోపాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## భారత్ జోడో యాత్ర ను ఎవరూ అపలేరు

### ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22 – రోజురోజుకూ ప్రజా మద్దతు కూడగట్టుకుంటున్న రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రను ఆపాలని చూస్తున్న బిజెపి అంతం మొదలయిందని నంద్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ చింతల మోహన్ రావు అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర అస్సాం రాష్ట్రంలో అడుగిడిననాటి నుండి దాడులకు తెగబడుతున్న తీరును ఖండిస్తూ సోమవారం నంద్యాల గాంధీ చౌక్ లో గల గాంధీ మహాత్ముడు విగ్రహం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ – x”దేశవ్యాప్తంగా ప్రజా మద్దతు కోల్పోతున్న అధికార బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై దాడులకు తెగబడటం వారి పశు సంస్కృతిని తెలియజేస్తుందని, అస్సాం పిసిసి అధ్యక్షులు భూపేన్ కుమార్ బోరా పై దాడికి తెగబడిన బిజెపి ప్రభుత్వ అప్రజాస్వామిక తీరును ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య రాష్ట్ర అధికార ప్రతినిధి వాసు సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్ మైనారిటీ నాయకులు చాబోలి సలాం సీనియర్ మైనార్టీ నాయకులు అహ్మద్ హుస్సేన్ నూర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ : భక్తులకు బంపరాఫర్





అయోధ్యలో అపూర్వఘట్టం ఆవిష్కృతమైంది. శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని అయోధ్యను దర్శించుకునే భక్తుల కోసం పలు విమానయాన సంస్థలు భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్ జెట్ అయోధ్యలో రామ మందిరాన్ని దర్శించుకునే భక్తుల కోసం విమాన ఛార్జీలపై రాయితీలు అందిస్తున్నట్లు ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భక్తులు రామ మందిర దర్శన కోసం విమాన టికెట్‌ను ప్రారంభ ధర రూ.1622గా నిర్ధేశించింది. నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రయాణికులు బుక్ చేసుకున్న తేదీని మార్చుకోవచ్చని, ఇందుకోసం ఎటువంటి అదనపు ఛార్జీలు చెల్లించే అవసరం లేదని తెలిపింది.ఫిబ్రవరి 1, 2024 నుంచి దేశంలో చెన్నై, అహ్మదాబాద్, ఢిల్లీ, ముంబై,బెంగళూరు, జైపూర్, పాట్నా, దర్భంగా నుంచి నేరుగా అయోధ్యకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఇక అయోధ్య నుంచి వారి నివాస ప్రాంతాలు చేరుకునేందుకు వీలుగా కొత్త విమానాల్ని అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించింది.ప్రపంచంలోని పలు దేశాల నుంచి దాదాపూ 200 విమానాల్లో అయోధ్యకు చేరుకునే సౌకర్యం ఉంది. భారత్‌లో ప్రారంభ విమాన టికెట్ ధర రూ.5000 ఉండగా.. ఇతర దేశాల నుంచి అయోధ్యకు చేరుకునేందుకు విమానయాన సంస్థను బట్టి టికెట్ ధర మారుతుంది. కానీ, స్పైస్‌జెట్ మాత్రం ప్రత్యేక ఆఫర్ కింద రూ.1622కే అందిస్తుంది. జనవరి 22 నుంచి జనవరి 28 మధ్య బుక్ చేసుకుంటే జనవరి 22 నుంచి సెప్టెంబర్ 30,2024లోపు మీరు ఎప్పుడైనా ప్రయాణించవచ్చు. తేదీలను మార్చుకోవచ్చు.

## ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

-నేడు ఆయన జయంతి మరియు పరాక్రమ దివస్



నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు. ఒకవైపు గాంధీజీ మొదలైన నాయకులందరూ అహింసావాదం తోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం సాగిస్తే బోస్ మాత్రం సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టిన వాడు. ఇతని మరణం ఇప్పటికీ ఒక రహస్యంగా మిగిలిపోయింది. సుభాష్ చంద్రబోస్. 23 జనవరి 1897న భారత దేశంలోని ఒడిషా లోని కటక్ పట్టణం లో ఒక ధనిక కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి జానకినాథ్ బోస్ లాయరు. తీవ్రమైన జాతీయవాది. బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ కి కూడా ఎన్నికయ్యాడు. తల్లి పేరు ప్రభావతి దేవి. బోస్ విద్యాభ్యాసం కటక్‌లోని రావెన్షా కాలేజియేట్ స్కూలులోను, కలకత్తాలోని స్కాటిష్ చర్చి కాలేజిలోను, ఫిట్జ్ విలియమ్ కాలేజిలోను, ఆపై కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం లోను సాగింది. 1920 లో బోస్ భారతీయ సివిల్ సర్వీసు పరీక్షలకు హాజరై అందులో నాలుగవ ర్యాంకులో నిలిచాడు. ఇంగ్లీషులో అత్యధిక మార్కులు సాధించాడు. అయినా 1921 ఏప్రిల్‌లో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ సివిల్ సర్వీసు నుండి వైదొలగి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొననారంభించాడు. భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగంలో చురుకైన పాత్ర నిర్వహించ సాగాడు.ఒకవైపు గాంధీజీ మొదలైన నాయకులందరూ అహింసావాదం తోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం సాగిస్తుంటే బోస్ మాత్రం సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టిన మహనీయుడు. ఇతని మరణం పై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.బోసు రెండు సార్లు భారత జాతీయ కాంగ్రెస్ కు అధ్యక్షుడిగా ఎన్నికైనా గాంధీ తో సిద్ధాంత పరమైన అభిప్రాయ భేదాల వలన ఆ పదవికి రాజీనామా చేశాడు. గాంధీ యొక్క అహింసావాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోసు భావన. ఈ అభిప్రాయాలతోనే ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అనే రాజకీయ పార్టీని కూడా స్థాపించాడు. దాదాపు 11 సార్లు ఆంగ్లేయులచే కారాగారంలో నిర్బంధించ బడ్డాడు. 1939 లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. ఆంగ్లేయులను దెబ్బ తీయటానికి దీన్ని ఒక సువర్ణవకాశంగా బోసు భావించాడు. యుద్ధం ప్రారంభం కాగానే అతను ఆంగ్లేయుల పై పొరాడేందుకు కూటమి ఏర్పాటు చేసే ఉద్దేశంతో రష్యా, జర్మనీ మరియు జపాను దేశాలలో పర్యటించాడు. జపాను సహాయంతో భారత యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు మరియు ఔత్సాహికులతో భారత జాతీయ సైన్యం ను ఏర్పాటు చేశాడు. జపాను ప్రభుత్వం అందించిన సైనిక, ఆర్థిక, దౌత్య సహకారాలతో ఆజాద్ హింద్ ప్రభుత్వం ను సింగపూర్ లో ఏర్పరచాడు.బోసు రాజకీయ అభిప్రాయాలు, జర్మనీ మరియు జపానుతో అతని మిత్రత్వం పై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు న్నాయి. కొందరు వీటిని విమర్శిస్తే, మరి కొందరు వాస్తవిక దృష్టితో చేసిన ప్రయత్నాలుగా బోసును అభిమానిస్తారు. అతని జీవితం లాగే మరణం కూడా వివాదాస్పదమైంది. 18 ఆగస్టు, 1945 లో తైవాన్ లో జరిగిన విమాన ప్రమాదం లో బోసు మరిణించాడని ప్రకటించినప్పటికి, అతను ప్రమాదం నుంచి బయట పడి అజ్ఞాతం లోకి వెళ్ళాడని పలువురు నమ్ముతారు. జననం ఉండి మరణం లేని ఏకైక నాయకుడు నేతాజీ

# తెరపైకి కొత్త చర్చ

విజయవాడ, జనవరి 22 మరో రెండు మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలుజరగనున్న ఏపీలో జిల్లాల విభజన, కొత్త జిల్లాలకు పేర్లు, కొత్త జిల్లాలకు కేంద్రాల విషయం మరోసారి చర్చకు వస్తోంది. 2014 రాష్ట్ర విభజన తర్వాత.. 13 జిల్లాలుగా ఉన్న ఏపీని వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. మరిన్ని జిల్లాలుగా మార్చింది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మారుస్తామని ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు.. మరో 13 జిల్లాలను ఏర్పాటు చేశారు. వాస్తవానికి 25 పార్లమెంటు స్థానాలే ఉన్నాయి. అయితే అరకు.. పెద్ద నియోజకవర్గం కావడంతో దీనిని రెండుగా విభజించారు. దీంతో మొత్తంగా 26 జిల్లాలు ఏర్పడ్డాయి. ఇది ఒక సంచలనంగా అప్పట్లో వైసీపీ ప్రచారం చేసుకుంది. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలోనూ.. దీనినే ప్రచారం చేసుకుంటోంది. వైసీపీ వచ్చిన తర్వాతే.. కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేశామని.. దీంతో ప్రభుత్వానికి.. ప్రజలకు మధ్య దూరం తగ్గిందని.. పాలన ప్రజలకు చేరువైందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది.ఇదేసమయంలోకొన్ని చిక్కులు కూడా ఉన్నాయి. ఇవి ఎన్నికలపై ఎంత వరకు ప్రభావం చూపుతాయనేది కూడా.. వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను విభజించి ఏర్పాటు చేసిన ఒక జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలనేది కాపు సామాజిక వర్గం డిమాండ్‌గా ఉంది. అప్పట్లోనూ వీరు ఉద్యమించారు. కానీ, వైసీపీ పట్టించుకోలేదు. కానీ, టీడీపీ అదినేత చంద్రబాబు నిర్వహించిన బాదుడే -బాదుడు సభల్లో ఈ డిమాండ్‌పై స్పందిస్తూ.. తాము అధికారంలోకి వచ్చాక.. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఈ వర్గం.. ఈ విషయాన్ని తరచుగా ప్రస్తావిస్తూనే ఉంది. ఇక, తూర్పుగోదావరి జిల్లాను విభజిస్తూ.. కొత్తగా ఏర్పాటు చేసిన కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును పెట్టారు. ఈ క్రమంలో ఓ కీలక సామాజిక వర్గం యువత రెచ్చిపోయి.. దాడులు, విధ్వంసాలకు దిగింది. ఏకంగా మంత్రి ఇంటికే నిప్పు పెట్టింది. ఎమ్మెల్యే ఇల్లు, పోలీస్ స్టేషన్ కు కూడా నిప్పు పెట్టి విధ్వంసాలకు దిగింది. ఈ కేసులను ఇటీవలే వైసీపీ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయితే.. ఇలా ఓ కీలక సామాజిక వర్గానికి మేలు చేస్తూ.. సర్కారు తీసుకున్న నిర్ణయంపై మెజారిటీ ఎస్సీ నాయకులు, ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. ఈ ప్రభావం కూడా.. వచ్చే ఎన్నికల్లో వైసీపీపై పడుతుందనే అంచనా కనిపిస్తోంది. అదేవిధంగా ఉమ్మడి గుంటూరును విభజించి.. పల్నాడు జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ జిల్లాలోనిమెజారిటీ ఎస్సీ సామాజిక వర్గం మాత్రం.. జిల్లాకు.. కవి జాషువా( పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ ఉద్యమాలు చేశారు. లేకపోతే.. బ్రహ్మనాయుడు పేరు పెట్టాలని కొందరు సూచించారు. తాజాగా ఈ విషయాలు మరోసారి చర్చకు వచ్చాయి.ఇక, రాయచోటి కేంద్రంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు.... రాజంపేట ను కేంద్రంగా చేయాలని ఇక్కడి వారు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఉద్యమాలు కూడా చేశారు. ఎమ్మెల్యే కుటుంబం సభ్యులు సైతం ఈఉద్యమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల ముంగిట ఈ విషయం కూడా చర్చగా మారింది. మొత్తంగా చూస్తే.. వైసీపీకి కొత్త జిల్లాలు ఏర్పాటు చేశామన్న పేరు ఉన్నా.. అంతర్గత వ్యతిరేకతతో ఇక్కడ ఎన్నికలు ప్రభావితం అవుతాయనే చర్చ సాగుతుండడం గమనార్హం.

# నగరిలో రోజా దారెటు



తిరుపతి, జనవరి 22 ఏపీలోని సెలబ్రిటీ నియోజకవర్గాల్లో ఒకటి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం. టీడీపీ కంచుకోట లాంటి నియోజకవర్గంలో రెండు సార్లు రోజా గెలిచారు. మరి ఈ సారి గెలుస్తారా అంటే అసలు టిక్కెట్ ఇస్తారా అన్న చర్చ ఎక్కువ జరుగుతోంది. గత రెండు సార్లు ఆమె గెలవడానికి తమిళ ఓటర్లు కీలకం. ఇటీవల రజనీకాంత్ పై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడి ఈ సారి వారినీ దూరం చేసుకున్నారు రోజా. ఇక సొంత నేతల సంగతి చెప్పాల్సిన పని లేదు. నియోజకవర్గంలో ఎవరితోనూ సఖ్యత ఉండని ఒకే ఒక్క నేత రోజా మంత్రి కావాలంటే ముందుగా ఎమ్మెల్యే కావాలి. ఎమ్మెల్యే అవ్వాలంటే నియోజకవర్గంలో పార్టీ నేతలందరితో సఖ్యతగా ఉండాలి. కానీ రోజా స్టైల్ వేరు. నగరి నియోజకవర్గంలో ఒక్క మండలం నేతతో కూడా ఆమె సఖ్యతగా ఉండరు. నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. ఐదు మండలాలకు చెందిన ముఖ్య నేతలు ఆమెకు వ్యతిరేకమే. ఈ ఐదుమండలాల నేతల్లో ఇద్దరు రాష్ట్ర స్థాయి పదవులు ఉన్న వారున్నారు. మిగిలిన వారు వారి వారి స్థాయిల్లో మండలాల్లో పట్టు ఉన్న వారు ఉన్నారు.జడ్పీటీసీలు లాంటి కీలక పదవుల్లో ఉన్న వారితోనూ ఇబ్బందులే. రోజాకు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి రాజకీయం ఎమ్మెల్యేపై ఇంత తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న నేతలు ఉన్నారంటే వారికి బలమైన సపోర్టు ఉన్నట్లే లెక్క. రోజా వ్యతిరేక వర్గానికి పెద్దిరెడ్డి సపోర్టు ఉంది. నగరిలో రోజాకు చెక్ పెట్టేందుకు మంత్రి పెద్దిరెడ్డి సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారని కొంత కాలంగా అభిప్రాయం ఉంది. రోజాకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న వారికి పెద్దిరెడ్డి సపోర్ట్ ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా మొత్తం తన గుప్పిట్లో ఉండాలని పెదిరెడ్డి రామచంద్రారెడ్డి అనుకుంచారు. కానీ రోజా ఆయనకు వ్యతిరేక వర్గంగా మారిపోయారు. గత రెండు సార్లు అందరూ కృషి చేసినా స్వల్ప తేడాతోనే రెండు సార్లు విజయం సాధించారు. నగరిలో తమిళ ఓటర్లు ఎక్కువగా ఉంటారు. రోజా భర్త సెల్వ మణి తమిళుడు. ఈ తమిళ నేపధ్యం ఉపయోగపడింది. ఇటీవల రజనీకాంత్ పై ఆమె చేసిన వ్యాఖ్యల తో ఆ వర్గంలోనూ వ్యతిరేకత పెంచుకున్నారు. గతంలోనే ఐదు మండలాల నేతలు సమావేశం పెట్టి.. ఇక మరోసారి రోజాకు చాన్సిస్తే గెలిపించే చాన్సే లేదని తీర్మానించుకున్నారు. రోజాకు టిక్కెట్ నిరాకరించే ఉద్దేశంతోనే ఇలా వారిని ఎగదోస్తున్నారని రోజా వర్గీయుల్లో అనుమానాలు కూడా ఉన్నాయి. రోజా చేసే రచ్చ భయంతోనే టిక్కెట్ ఇచ్చే చాన్స్ రోజా.. జగన్ మోహన్ రెడ్డిపై నమ్మకంతో .. టీడీపీ వాళ్లను ఇష్టారీతిన తిట్టింది. పవన్ నూ వదల్లేదు. ఆమెకు వైసీపీ తప్ప మరో రాజకీయ వేదిక లేదు. ఉండదు కూడా. అలా అన్ని ఆప్షన్లను వదులుకుని ఉంటే.. ఇప్పుడు టిక్కెట్ నిరాకరిస్తారా అని ఆమె రెచ్చిపోతే? జగన్ రెడ్డి, సజ్జల రెడ్డి తట్టుకోలేరన్నది ఎక్కువ మంది భావన. అయితే చివరికి వేరే వారికి టిక్కెట్ ఇచ్చినా ఆశ్చర్యం లేదన్న వాదన వినిపిస్తోంది.

# బొత్సాకు బాగోలేదా



విజయనగరం, జనవరి 22 మంత్రి బొత్స సత్యనారాయణ కంచుకోట చీపురుపల్లిలో ఎదురీదుతున్నారు. ఆయన ఇతర మండలాల్లో వెనుక బడినా మొరకముడిదాం అనే మండలంలో భారీ మెజార్టీ వస్తుంది. ఈ కారణంగా ఆయన స్వల్ప తేడాతో అయినా బయటపడుతూ వస్తున్నారు. కానీ ఈ సారి ఆ మొరకముడిదాం మొత్తం ఈ సారి బొత్సకు మూడిందన్న సంకేతాలు పంపుతోంది. పార్టీ క్యాడర్ అంతా గుడ్ బై చెప్పి టీడీపీలో చేరుతున్నారు. వారిని ఆపేందుకు బొత్స మేనల్లుడు చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తున్నాయి. వారం రోజుల కిందట మండలంలో మేజర్ పంచాయతీ అయిన సోమలింగాపురం వైసీపీ నేతలంతా టీడీపీలో చేరిపోయారు. గురువారం చంద్రబాబు సమక్షంలో కోట్ల సుగుణాకర్ రావు అనే నేతతో పాటు మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు కూడా టీడీపీలో చేరారు. సుగుణాకర్ రావు పార్టీ మారడం బొత్సకు పెద్ద దెబ్బని భావిస్తున్నారు. ఆయనను ఆపేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. బొత్సకు ఏకపక్షంగా ఓట్లేసే గ్రామాల్లో ఇప్పుడు రెండు వర్గాలయ్యాయి. మరో వైపు టీడీపీ తరపున యువ నాయకుడు కిమిడి నాగార్జున సామాన్యుల్లో సామాన్యుడిగా తిరుగుతున్నారు. ప్రతీ గ్రామానికి వెళ్తున్నారు. అందర్నీ పలకరిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి అమెరికాలో మంచి ఉద్యోగం చేసుకుంటున్న ఆయన రాజకీయాల కోసం అన్నీ వదిలేసి వచ్చారు. ప్రభుత్వ నిర్వాకాలపై పోరాడుతున్నారు. మాజీ మంత్రి కిమిడి మృణాళిని కుమారుడు నాగార్జున. గత ఎన్నికల్లో చివరి క్షణంలో టిక్కెట్ దక్కించుకుని పోటీ చేశారు. ఓడిపోయినా నియోజకవర్గాన్ని అంటి పెట్టుకుని ఉన్నారు. ఆ ప్రయత్నాలు ఫలించే సూచనలు కనిపిస్తున్నాయి.సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణకు...నియోజకవర్గంలో సొంత పార్టీ నేతలే ఝలక్ ఇస్తున్నారు. అధికార పార్టీకి గుడ్ బై చెప్పి... ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పేసుకుంటున్నారు. బొత్స సత్యనారాయణ గెలుపులో కీలకంగా ఉన్న మెరకముడిదాం మండలంలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, కోట్ల సుగుణాకరరావు తీర్థం పుచ్చుకున్నారు. గద్దే బాబురావు... 1994,1999లో చీపురుపల్లి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు.అటు కోట్ల సుగుణాకరావు...విజయనగరం జిల్లా వయోజన విద్యా శాఖ ఉప సంచాలకుడిగా పనిచేశారు. ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. సుగుణాకరరావు తండ్రి కోట్ల సన్యాసి అప్పలనాయుడు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962 ఎన్నికల్లో సన్యాసి అప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. కోట్ల సుగుణాకరరావు కుటుంబానికి చెందిన వ్యక్తులే మెరకముడిదాం మండల జడ్పీటీసీ సభ్యులుగా, మండలాధ్యక్షులుగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావుకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండటంతో...చీపురుపల్లిలో తెలుగుదేశం పార్టీ బలపడుతుందని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పలు పంచాయతీల సర్పంచ్ లు, ఎంపీటీసీలు...వైసీపీ వీడి తెలుగుదేశం తీర్థం పుచ్చుకుంటున్నారు. బొత్స అనుచరులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా...వలసలు మాత్రం ఆపలేకపోతున్నారు. కోట్ల సుగుణాకరరావుకు జిల్లా వ్యాప్తంగా బంధుత్వాలు, విస్తృత పరిచయాలు ఉన్నాయి. సుగుణాకరరావు బాటలోనే మరికొందరు నేతలు పయనించే అవకాశం ఉంది. బొత్స సత్యనారాయణకు చీపురుపల్లి నియోజకవర్గం పెట్టని కోట. ప్రస్తుతం జగన్ కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు మున్సిపల్ మంత్రిగా పని చేశారు. బొత్స సత్యనారాయణ ...బొబ్బిలి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1999లో ఎంపీగా గెలుపొందారు. 2004 నుంచి 2019 వరకు నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే...2014లో మాత్రమే ఓటమి పాలయ్యారు. 2004, 2009లో కాంగ్రెస్ తరపున, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాల్లో భారీ పరిశ్రమలు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, రవాణా, మార్కెటింగ్ శాఖల మంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మూడు సార్లు గెలిచిన ఏకైక రాజకీయ నేత. రాష్ట్ర రాజకీయాల్లో కీలకనేతగా ఎదిగారు. విజయనగరం జిల్లాలో ఏ పార్టీ మెజార్టీ నియోజకవర్గాల్లో గెలుపొందాలన్న...బొత్స సత్యనారాయణ సపోర్టు తీసుకోవాల్సిందే. అంతలా విజయనగరం జిల్లాపై పట్టుబిగించారు.

# వైసీపీకి వరుస షాక్ లు

కాకినాడ, జనవరి 22 ఆంధ్రప్రదేశ్ లో అధికార పార్టీ కి షాకుల మీదు షాకులు తగులుతున్నాయి. నేతలు వరుసబెట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసీపీ గుడ్ బై చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన కండువాలు కప్పుకుంటున్నారు. ఎప్పుడు ఎవరు వైసీపీకి ఝలక్ ఇస్తారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇవాళ వైసీపీలో ఉన్న నాయకులు...రేపు ఉంటారో లేదో తెలియడం లేదు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలుపొందిన కీలక నేతలంతా ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో రీజినల్ కో-అర్డినేటర్లు నచ్చజెబుతున్నా పట్టించుకోవడం లేదు. కొందరికి సీఎంవో నుంచి పిలుపు వచ్చినా వెళ్లడం లేదు. కొందరు ముఖ్యమంత్రి జగన్ తో మాట్లాడిన తర్వాత కూడా పార్టీకి బై బై చెప్పేస్తున్నారు. మొన్న మాజీ మంత్రి పార్థసారథి, నిన్న మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, తాజాగా శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ వ్యవస్థాపకుడు వాసంశెట్టి సుభాష్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి షాకిచ్చారు. పార్టీకి రాం రాం చెబుతున్నట్లు సుభాష్ ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అమలాపురానికి చెందిన వైసీపీ యువజన నేత, శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ వ్యవస్థాపకుడు వాసంశెట్టి సుభాష్ వైసీపీ రాజీనామా చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నట్లు ప్రకటించారు. శనివారం 5వేల మంది అనుచరులతో ర్యాలీగా వెళ్లి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు వెల్లడించారు. జిల్లాలో మంత్రి విశ్వరూప్, మరికొంత మంది సొంత పార్టీ నేతలు అనేక ఇబ్బందులు పెట్టారని వాసంశెట్టి సుభాష్ వాపోయారు. ఇబ్బందుల పాల్జేసిన వారికి అసెంబ్లీ టికెట్ ఇవ్వొద్దని చెప్పినా...వైసీపీ హైకమాండ్ పట్టించుకోలేదన్నారు. జిల్లా పేరు మార్పుపై జరిగిన అల్లర్ల కేసులోనూ...తమ సామాజిక వర్గాన్ని ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరినా...హైకమాండ్ పట్టించుకోలేదన్నారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, చింతలపూడి ఎమ్మెల్యే ఎలిజా పార్టీ నాయకత్వంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఎమ్మెల్యే ఎలిజా ఇప్పటికే పార్టీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తాజాగా తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి తిరుగుబావుట ఎగురవేశారు. ఓ ఎంపీ చెప్పిన మాట విని...తనకు సీటు లేకుండా చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని, రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. మరోవైపు రెండోసారి అధికారంలోకి రావడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యూహాలు రూపొందిస్తున్నారు. నాలుగు జాబితాలను రిలీజ్ చేశారు. సర్వేల్లో రిపోర్టులు అనుకూలంగా లేకపోతే...ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. గెలిచే వారికే టికెట్ అని చెప్పేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. ప్రత్యర్థులు ఎత్తులు చిత్తయ్యేలా...కూటమికి ఝలక్ ఇచ్చేలా వ్యూహాలు సిద్ధం చేస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అయినా...మంత్రులయినా...మాజీ మంత్రులైనా... ఎంపీలయినా సరే...దుకాణం సర్దుకోవాల్సిందేనని ఖరాఖండిగా చెబుతున్నారు.

# ఉత్తరాంధ్ర ఎవరికి...

విశాఖపట్టణం, జనవరి 22 ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావాలంటే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మెజార్టీ స్థానాలను కైవశం చేసుకోవడం ఎంత ముఖ్యమో.. ఉత్తరాంధ్రలో ఆధిపత్యం చెలాయించడం కూడా అంతే ముఖ్యం. ఇక్కడ మెజార్టీ స్థానాలను దక్కించుకుంటే అధికారం వైపు అంత సులభంగా అడుగులు వేయవచ్చు. గత ఎన్నికల ఫలితాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2019 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ గాలి వీయడంతో మెజార్టీ స్థానాలను దక్కించుకుని విజయాన్ని చేజిక్కించుకుంది.వచ్చే ఎన్నికల్లో కూడా ఉత్తరాంధ్రలో సత్తా చాటాలని ప్రధాన పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. విజయమే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అధికార వైసీపీ సంక్షేమ పథకాలను అజెండాగా తీసుకుని ఎన్నికలకు వెళ?తుండగా, ప్రభుత్వ వైఫల్యాలే అస్త్రంగా ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం ప్రజల్లోకి వెళుతోంది. ఉత్తరాంధ్రలో మొత్తంగా 34 స్థానాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ ఇక్కడ అత్యధిక స్థానాలను దక్కించుకుని అధికార పీఠాన్ని కైవశం చేసుకుంది. రాష్ట్ర విభజన తరువాత జరిగిన రెండు ఎన్నికలు, అంతకు ముందు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఉత్తరాంధ్రలో ఎక్కువ స్థానాలు గెలిచిన పార్టీలు అధికారాన్ని దక్కించుకుంటున్నాయి. 2014 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని 34 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 26 స్థానాల్లో విజయం సాధించగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎనిమిది స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. అంటే, దాదాపు మూడు వంతులకుపైగా స్థానాలను టీడీపీ గెల్చుకుని అధికాకారాన్ని దక్కించుకుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ హవా నడిచింది. 34 స్థానాలకుగాను 28 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించగా, ఆరు స్థానాలకు మాత్రమే తెలుగుదేశం పరిమితమై అధికారాన్ని కోల్పోయింది.2014 ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, ఆముదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. రాజాం, పాలకొండ స్థానాల్లో వైసీపీ విజయం దక్కించుకుంది. 2019 ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. అదే రెండు స్థానాలకు తెలుగుదేశం పార్టీ పరిమితమైంది. టెక్కలిలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురంలో బెందాళం అశోక్ విజయం సాధించగా, మిగిలిన స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు.2014 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలోని తొమ్మిది స్థానాల్లో ఆరు తెలుగుదేశం పార్టీ, మూడింటిని వైసీపీ దక్కించుకున్నాయి. కురుపాం, సాలూరు, బొబ్బిలి స్థానాల్లో వైసీపీ విజయం సాధించగా, చీపురుపల్లి, పార్వతీపురం, గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం, శృంగవరపుకోట స్థానాల్లో టీడీపీ విజయం సాధించింది. 2019 ఎన్నికల్లో మొత్తం తొమ్మిది స్థానాలను వైసీపీ దక్కించుకుంది.విశాఖపట్నం జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాల్లో 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ(మిత్రపక్షం బీజేపీతో కలిపి) 12 స్థానాలను దక్కించుకుంది. వైసీపీ మూడు స్థానాలకు పరిమితమైంది. 2019 ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకున్న వైసీపీ విశాఖ నగర పరిధిలోని తూర్పు, దక్షిణం, పశ్చిమ, ఉత్తర నియోజకవర్గాలు మినహా మిగిలిన చోట్ల ఓటమిపాలైంది. నగర పరిధిలోని నాలుగు స్థానాలను మాత్రమే టీడీపీ దక్కించుకోగా, గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతంలోని సీట్లన్నింటినీలోనూ వైసీపీ అభ్యర్థులు విజయం సాధించడం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ఉత్తరాంధ్ర సెంటిమెంట్‌ను కొనసాగించే ఉద్దేశంలో ప్రధాన పార్టీలు మెజార్టీ స్థానాలు దక్కించుకోవడంపై దృష్టి సారించాయి. విజయమే లక్ష్యంగా వ్యూహ, ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే అధికార వైసీపీ అభ్యర్థులు ఎంపికపై దృష్టి సారించింది. మార్పులు, చేర్పులు చేస్తోంది. గడిచిన రెండు ఎన్నికల్లో రాజాం ఎమ్మెల్యేగా విజయం సాధించిన కంబాల జోగులకు స్థానం చలనం కలిగించిన వైసీపీ కొత్త వ్యక్తికి ఇక్కడ అవకాశం కల్పించింది. అలాగే, మరో రెండు నియోజకవర్గాల్లోనూ మార్పులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.టీడీపీ కూడా ఆర్థిక, అంగబలం ఉన్న నేతలను బరిలోకి దించేందుకు సన్నాహాలు చేస్తోంది.

# కింజరప్పు కోటలో పాగా సాధ్యమేనా

శ్రీకాకుళం, జనవరి 22 రాష్ట్రంలో అందరూ చూపు టెక్కలి నియోజకవర్గం పైనే ఉంది. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చం నాయుడు ఓటమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పటినుండే పావులు కదుపుతున్నారు. దీంతో ఇప్పుడు నియోజకవర్గంపై మరోసారి అందరి చూపు మళ్లింది. వైసీపీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ కు అ పార్టీ టికెట్ కేటాయించింది, సమన్వయకర్తగా ప్రకటించడంతో, వీరిద్దరి మధ్య పోటీ రేపటి ఎన్నికల్లో జరగనుంది.గతంలో ఒకసారి దువ్వాడ పోటీ చేసి ఓటమి చవి చూశా రు. ఎంతో బలమైన నియోజకవర్గం గా తెలుగుదేశం పార్టీకి అండగా ఈ సెగ్మెంట్ ఉంది. ఈసారి ఎలాగైనా సరే కింజరాపు కోటను బద్దలు కొట్టాలని వైసీపీ కలలుగం టోంది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 18 నెలల క్రితమే దువ్వాడను మీ చేతిలో పెడుతున్నట్టు ఆనాటి బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక రకంగా చెప్పాలంటే రాష్ట్రంలో ప్రకటించిన మొట్టమొదటి నియోజక వర్గం టెక్కలి కావడం విశేషం. తర్వాత దువ్వాడ కుటుంబంలో ఎన్నో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నా, చివరకు దువ్వాడ శ్రీనుకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు వస్తున్నాయి .సహజంగా దురుసు స్వభావంతో అచ్చం నాయుడు పై విమర్శలను ఎక్కువ పెట్టడం దువ్వాడకు కష్టమైన పని కాదు. ఒంటికాలుపై లేచిన ఎన్నో సందర్భాలు ఉన్నాయి. అచ్చన్నపై ఘాటైన విమర్శలు చేస్తూ ముఖ్యమంత్రి దృష్టిలో చాలా సార్లు దువ్వాడ పడ్డారు. గత ఎన్నికల్లో దువ్వాడను పార్లమెంట్ కి పోటీ చేయించి, పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ ను చెక్ పెట్టాలని ప్రయత్నించారు. కాని ఆ ఎన్నికల్లో దువ్వాడ స్వల్ప తేడాతో ఓటమి చవి చూశారు. ఫలితంగా శ్రీనుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ప్రోత్సహించారు. అప్పటినుండి నియోజకవర్గంలో పట్టు సాధించే ప్రయత్నంలో అనేక ఎత్తు పల్లాలు ఎక్కారు. మూలపేట పోర్టు నిర్మాణం లో ప్రధాన పాత్ర పోషిస్తూ, ముఖ్యమంత్రికి అంతరంగికుడిగా వ్యవహరిస్తున్నారు.సహజంగా ఈ నియోజకవర్గం విభజనలో ఏర్పడింది. కళింగ సామాజిక వర్గంతో పాటు మిగిలిన సామాజిక వర్గాలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అచ్చెం నాయుడు కుటుంబానికి గతం నుండి అనేక గ్రామాలు మద్దతు పలుకుతూ ఓటింగ్ సరళిని పెంచుకునే వెసులుబాటు కొన్ని గ్రామాలు ఆ కుటుంబానికి పాకెట్స్ గా ఉన్నాయి. అయితే ఇప్పుడు దువ్వాడ దానిపై దృష్టి సారిస్తే తప్ప ఆయనకి విజయ అవకాశాలు తక్కువ.నియోజవర్గంలో నాలుగు స్తంభాలాట వైసీపీ పార్టీలో ఎప్పటి నుండో ఉంది. వైసిపి అధిష్టానం కూడా కృపారాణీ నీ పెడచెవిన పెట్టింది. రాజ్యసభ సీటు తనకు వస్తుందని ఆశతో కృపరాణి ఎంతగానో చూశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆమె ఆశలపై నీళ్లు చల్లారు. ఇక చింతాడ గణపతి గౌరవప్రదమైన పోర్టు పోలియేలు కల్పించలేదు. ఈ ఎన్నికల్లో వీరందరూ దువ్వాడ కు సహకరిస్తారా లేదా అనేది కూడా అనుమానమే... మొన్నటివరకు పీకల్లోతు కుటుంబ వివాదాల్లో ఉన్న దువ్వాడకు అన్ని సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి.

## అయోధ్యలో రామమందిర ప్రతిష్ట సందర్భంగా రాజానగర్ రామాలయంలో పూజలు.



కౌతాళం మండలం (విభారే న్యూస్ జనవరి 22) : కౌతాళం మండలం రాజానగర్ లో శ్రీ అయోధ్య రామ మందిరంలో కొలువ ధీరిన బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా రాజానగర్ శ్రీరామ దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొని అయోధ్య శ్రీరాముని ఆశీస్సులు ప్రజలం దరిపై ఉండాలని, కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించిన టీడీపీ మండల ఇంచార్జ్ అల్లూరి వెంకట పతి రాజు నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో రాజానగర్ మరియు చుట్టుపక్కల గ్రామల భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూతన ఎస్సై షేక్ నాగీన

ఆళ్లగడ్డ ప్రతినిధి జనవరి 22 విభారె న్యూస్ :- శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆళ్లగడ్డ పట్టణ 1వ ఎస్సై షేక్ నగీనా అన్నారు. ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐ 1 గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల మూడవ పట్టణ స్టేషన్ లో ఎస్సైగా పనిచేస్తున్న నగీనా ను ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేస్తూ నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తానన్నారు.

## తాసిల్దార్ చేతులమీదుగా న్యూస్ వన్ క్యాలెండర్ ని ఆవిష్కరణ



పెద్దకడబూరుజనవరి22(విభారెన్యూస్ప్రతినిధి) పెద్దకడబూరు మండలంలోని న్యూస్ వన్ క్యాలెండర్ తాసిల్దార్ చేతులమీదుగాఆవిష్కరణచేయడంజరిగిందిఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాట్లాడుతూ. ప్రతి ఒక్క విలేకరు తమ కర్తవ్యాన్ని నిర్వహించి ప్రజలకు మేలు చేసే విధంగా అన్ని విధాలుగాఅండ ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమానికి న్యూస్ వన్ ప్రతినిధి నౌలేకల్ రాజు గణేష్ యం రాజు నరసింహ రాగమున్ని బీమా రూసి లక్ష్మన్న ఈరన్న తదితరులు పాల్గొని నూతన క్యాలెండర్ ని ఆవిష్కరించడం జరిగింది.

## ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం



ఆళ్లగడ్డ ప్రతినిధి జనవరి 22 విభారె న్యూస్ :- అయోధ్యలో బాల రాముని ప్రతిష్ట సందర్భంగా ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం జరిగింది. ఆళ్లగడ్డ శ్రీ కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్ర చార్యులు ధర్మపత్ని సావిత్రమ్మలు సోమవారం ప్రభుత్వ అధికారులు రోగులకు బాలింతలకు గర్భవతులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి. గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు.. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



కోసిగి.జనవరి 22 (విభారె న్యూస్) కోసిగి మండలం పరిధిలోని పల్లెపాడు గ్రామంలో హైస్కూలులో8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి , మండల ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడం జరిగిందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం కోసిగి మండలం పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు యంఈఓ నాగేశప్ప నేతృత్వంలో ప్రధానోపాధ్యాయులు రామలింగప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన ట్యాబుల పంపిణీ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మండల ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,పేద విద్యార్థులకు దృష్టిలో ఉంచుకొని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా జగనన్న పాలనలో నాడు నేడు క్రింద పాఠశాలల రూపురేఖల మార్పు,8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ,బైజూస్ తో ఒప్పందం, విద్యా కానుక,అమ్మ ఒడి, గోరుముద్ద,విద్యా,వసతి దీవెనలు వంటి పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అని ఘంటాపథంగా చెప్పవచ్చు. అనంతరం మండలంలోని 1357 విద్యార్థులకు మంజూరు కాగా, అందులో పల్లెపాడు హైస్కూల్ కు మంజూరైన 22 ట్యాబులను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో యంపీపీ ఈరన్న,యన్ నాగరాజు, జగదీష్ స్వామి,బుళ్ళి నరసింహులు,షౌఖత్ అలీ హాజీ ఉస్మాన్,లంకారెడ్డి, నరసింహులు గౌడ్,దొడ్డి నర్సన్న,చింతకుంట ఈరన్న, నర్సయ్య,తిమ్మారెడ్డి,కృష్ణారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

### అభిరుచి మదు బిజెపి కన్వీనర్ నంద్యాల




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22- అధిష్టానం ఆదేశిస్తే నంద్యాల అసెంబ్లీ కి పోటి చేయడానికి సిద్ధంగా ఉన్నానని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలో బిజెపి పార్టీ లో అభిరుచి మదు చేరడంతో ఆకాశమంత ఎత్తుకు ఎదిగిందని బిజెపి పార్టీ కార్యకర్తలు అభిమానులు పేర్కొన్నారు . ప్రధాన పార్టీలతో పోటీ పడడం అభిరుచి మదుకే సాధ్యమని పలువురు రాజకీయ నాయకులు చెబుతున్నారు .ఆదివారం నంద్యాల కు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి ఘనస్వాగతం పలకడం లో అభిరుచి మదు సక్సెస్ అయ్యారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అలాగే బీజేపీ శ్రేణుల ర్యాలీ విజయవంతం అయిందని ర్యాలీ లో చెక్కబజనలు, డ్రమ్స్ వాయిద్యాలు. గజమాలతో స్వాగతం ఆకట్టు కున్నాయని పలువురు ప్రశంసించారు. నంద్యాలలో బీజేపీ శ్రేణులు కోలాహలం పండుగ వాతావరణం తలపించిందని నంద్యాల బీజేపీలో నూతనోత్సాహం నింపిందని. కార్యకర్తలు స్వచ్ఛందంగా భారీగా తరలిరావడంతో ప్రధాన పార్టీల తో సైతం పోటి పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు . నంద్యాల నియోజకవర్గంలోని బిజెపి కార్యకర్తలను ఏకం చేయడంలో విజయం సాధించారని గతంలో బిజెపి లో వున్న చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ ఆకట్టుకున్నారని పలువురు ప్రశంసించారు.

# మీడియాపై దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఏపీడబ్ల్యూజేఎఫ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22-ఆదివారం అర్ధరాత్రి విజయవాడ ధర్నా చౌక్ లో అంగన్వాడి వర్కర్స్ పై పోలీసులు దౌర్జన్యంగా విరుచుకుపడి అరెస్టు చేస్తున్న సందర్భంగా వార్తల కవరేజ్ కి వెళ్ళిన విలేకరులు, ఫోటోగ్రాఫర్లపై దాడులు చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నంద్యాల జిల్లా కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్, కో కన్వీనర్ శివలు డిమాండ్ చేశారు.సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ డిసిపి విశాల్ గున్ని నాయకత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున జర్నలిస్టుల పై దౌర్జన్యానికి పాల్పడడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ చరిత్రలోనే విలేకరులపై ఇంత పెద్ద ఎత్తున పోలీసులు దౌర్జన్యానికి పాల్పడడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారని తెలిపారు. ఫోటోగ్రాఫర్లను పోలీస్ వ్యాన్ లలో ఎక్కించి అరెస్టు చేసి తీసుకెళ్లడం దుర్మార్గమైన చర్య అని, జర్నలిస్టులకు ఉన్న హక్కులను సైతం కలరాస్తున్న పోలీస్ వారిపై చర్యలు తీసుకివాలని కోరారు. ప్రజాశక్తి ఫోటోగ్రాఫర్ రాముసు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారని, మరో ఫోటోగ్రాఫర్ రమణ పై దౌర్జన్యంగా వ్యవహరించారు. మేము మీడియా ఫోటో తీస్తున్నాం సార్, వార్తలు కవరేజ్ కి వచ్చామంటే మీడియా అయితే ఏమిటి అంటూ డిసిపి విశాల్ గున్ని నిర్లక్ష్యంగా మాట్లాడారు దురుసుగా ప్రవర్తించారు.విశాల్ గున్ని పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన కింది పోలీస్ అధికారులు మరింత రెచ్చిపోయి మీడియాపై దౌర్జన్యంగా వ్యవహరించారని, పోలీసుల తీరును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ,జిల్లా కమిటీలు,రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు తీవ్రంగా ఖండిస్తున్నారని మీడియాపై దౌర్జన్యానికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## బాల రాముని ప్రతిష్ట సందర్భంగా శిల్పా నగరంలో ఆంజనేయ గుడిలో ప్రత్యేక పూజలు.



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22- అయోధ్య రామ మందిరంలో కొలువ ధీరిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా శిల్పా నగరంలో ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొని అయోధ్య శ్రీరాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రత్యేక పూజాలు చేశి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కాలనీ కమిటీ పెద్దలు గఫూర్. బిఎస్ఎన్ఎల్రవి.కేశాల్రెడ్డి.రైస్మిల్లు ఓనర్ లింగారెడ్డి. రమణయ్య. ధనుంజయుడు. ఏకాంబరం. తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా కులగణన సర్వే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22-: నంద్యాల పట్టణంలో 47 సచివాలయల పరిధిలో వేగంగా కులగణన సాగుతోందని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి పేర్కొన్నారు. ఆయా వార్డుల్లో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిసేకరిస్తున్నారని అన్నారు. సోమవారం వివిధ వార్డుల్లో సర్వే సాగుతుండగా 36-వార్డు. మరియు 22 వ (రైతునగరం) వార్డు లో అకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ . కుల గణన సర్వే, కులాల వారి జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థికపురోగతి నమోదు చేయాలని అన్నారు. ఈ కులగణన ద్వారా అర్హులైనవారిని గుర్తించి వారికి ప్రజా పథకాలు లబ్ది చేకూర్చడానికి, పథకాలుసక్రమంగా అమలు పరచి తద్వారా సామాజిక న్యాయాన్నిపెంపొందించేందుకు ఉపయోగ పడుతుందన్నారు. కుల గణన నిర్వహణపైవిస్తృత స్థాయి అవగాహన ప్రచారం కూడా చేయడం జరిగిందన్నారు. కులగణన జరుగు రూట్ మ్యాప్, రోజువారీ సర్వే షెడ్యూల్ వార్డు సచివాలయమునందలి నోటిసు బోర్డు నందుప్రదర్శించాలన్నారుపట్టణంలో అన్ని వార్డుల్లోకుల గణన నిర్వహణ అన్ని గృహాలు వేటిని విస్మరించకుండా గణన చేయాలనిఅన్నారు. వసతి గృహములు, వృద్ధాశ్రమములు మొదలైనవి గణనచేయునప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించి అవకతవకలు జరగకుండా జాగ్రత్తవహించాలని అధికారులకు సచివాలయు సిబ్బంది కీ ఆదేశించారు. కులగణన నిర్వహించెందుకు ప్రభుత్వంచే రూపొందించిన యాప్ నందు వివరాలునమోదు చేయాలని సూచించారు.

## షాదిఖ్ నగరంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22-అయోధ్య రామమందిరంలో శ్రీబాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా నంద్యాల పట్టణం షాదిక్ నగర్లో వెలసిన రామాలయంలో స్థానిక కౌన్సిలర్ కృష్ణమోహన్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీరాములవారికి ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందుముస్లిం సోదరులు కలిసి రామాలయంలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం హిందు ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు దేశం సుధాకర్రెడ్డి, సిద్ధశివరాం, రమేష్, ఆదిరెడ్డి, మాబాషా, మార్కెట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ లో చేరిన వడ్డెర కుటుంబాలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 22-.పట్టణంలోని వివిధ వార్డుల్లో వున్న వడ్డెర కుటుంబాలు బిజెపి పార్టీలో చేరినట్లు నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు. బిజెపి కార్యాలయంలో నంద్యాల అధ్యక్షులు కశెట్టి చంద్రశేఖర్,అభిరుచి అధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు చల్లా మద్దిలేటి,మదు నేతృత్వంలో 50 కుటుంబాలు పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజలకు ఇచ్చినమాట నిలబెట్టుకునే పార్టీ అన్నారు.రాష్ట్ర అభివృద్ధి కావాలంటే బిజెపితో సాధ్యం అన్నారు. బిజెపి చేస్తున్న పథకాలు పేదలకు ఎంతో ఉపయోగం అన్నారు.పార్టీలో వద్దే సంఘం నాయకులు టి వేంకటేశ్వర రావు,పుల్లయ్య ,నాగంరాజు,కృష్ణ,కటారి కృష్ణ,వరప్రసాద్,కిషోర్ బాబు ,చిన్న, రవికుమార్,రామాంజ నేయులు ,మద్దిలేటి,రఫీ,కామేశ్వర రావు చేరారు.ఈ కార్యక్రమంలో మండల గంగాధర్,లక్ష్మి రెడ్డి, కృష్ణా రెడ్డి,ఉపెంద్రణత రెడ్డి,శివ కుమార్ తదితరులు హాజరయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL-518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**